మట్టి.. స్వభావం కనిపెట్టి

భూసార పరీక్షలు చేస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

ఈనాడు సిరిసిల్ల

వ్యవసాయ శాఖలో క్షేత్ర స్థాయిలో సరిపడా సిబ్బంది లేక భూసార పరీక్షల ప్రాధాన్యతను రైతులకు వివరించే పరిస్థితులు లేవు. ప్రభుత్వం భూసార పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడంలో చాలా ఏళ్లుగా సందిగ్ధం నెలకొంది. ఈ యాసంగి సీజన్ నుంచి జిల్లా వ్యవసాయ కళాశాలలో రైతులకు భూసార పరీక్షలు నిర్వహించనున్నారు. నేల ఆరోగ్యం, పంటల సాగు, రసాయన ఎరువుల వినియోగంపై అవగాహన కలిగించడం ద్వారా రైతులకు మేలు జరుగుతుంది. ఇప్పటికే విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడకంతో భూసారం దెబ్బతింటోంది. దీనిపై అవగాహన కలిగిస్తే జరుగుతున్న నష్టాన్ని నివారించవచ్చని నిర్ణయానికొచ్చారు. నాలుగో సంవత్సరం విద్యార్థులు మృత్తికా శాస్త్రం పాఠ్యాంశంలో ప్రయోగాల ద్వారా నేర్చుకుంటారు. వీరు కళాశాల సహ ఆచార్యులు మాధవి పర్యవేక్షణలో మట్టి, సాగునీటి పరీక్షలు చేస్తారు.

● నేలలో సహజంగా ఉన్న పోషకాలతో పాటు అదనంగా వేసే సేంద్రియ, రసాయన ఎరువుల్లోని పోషకాలు అంది పంట దిగుబడికి దోహదపడతాయి. కాబట్టి రైతులు నేలల్లో ఉన్న భూసారాన్ని తరచూ తెలుసుకోవడం ఎంతో అవసరం. తద్వారా ఎరువుల వాడకంలో ఖర్చులు తగ్గించవచ్చు. ఫలితంగా అధిక దిగుబడులను పొందవచ్చు. దీనికోసం రైతులు వారి వ్యవసాయ క్షేత్రాల్లోని మట్టిని కనీసం రెండేళ్లకోసారి పరీక్ష చేయించుకుంటే మంచిది. వ్యవసాయశాఖ భూసార పరీక్ష కేంద్రం లేకపోయినా జిల్లాలోని వ్యవసాయ కళాశాలలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే మంచిది.

జిల్లాలో సాగు స్వరూపం
- సాగు విస్తీర్ణం : 2.40 లక్షల ఎకరాలు
- ప్రధాన పంటలు : వరి, పత్తి, మొక్కజొన్న
- ప్రధాన నేలలు: నల్లరేగడి, ఎర్రచెలక, ఇసుక నేలలు, చౌడు భూములు


పొలంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న విద్యార్థులు


ప్రయోగశాలలో నమూనాలను పరీక్షిస్తున్న విద్యార్థులు

రైతులు కోరితే గ్రామాలకే వెళ్తాం



జిల్లాలో భూసార పరీక్ష కేంద్రం లేదు. దీంతో చాలా మంది రైతులకు మట్టి పరీక్షలపై అవగాహన లేకుండా పోయింది. రైతులు కోరితే జిల్లాలో ఎక్కడికైనా విద్యార్థులమే వెళ్లి నమూనాలు సేకరించి ఫలితాలను రైతులకు తెలియజేస్తాం. ఏటా ఒక మండలంలో మూడో వంతు చొప్పన రైతులందరి భూముల్లో మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయించి ఫలితాలు తెలుసుకుంటే మంచిది. గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో పోషకాల లభ్యత, మట్టిలో లోపాలు, రైతులు పాటించాల్సిన ఎరువుల యాజమాన్యం గురించి అక్కడే వివరించే అవకాశం ఉంటుంది. - భరత్

సీజన్ ప్రారంభానికి ముందు...



పంటల సీజన్‌కు ముందు నేలలన్నీ ఖాళీగా ఉంటాయి. దుక్కులు దున్నే సమయంలో పరీక్షలు చేయించుకుంటే మంచిది. మనకు ఆరోగ్య కార్డులు ఎలాగో పంటలకు మట్టి పరీక్ష అలాంటిదే. నేల ఆరోగ్యాన్ని బట్టి పంటల సాగు, ఎరువులను వాడాలి. అప్పుడే రైతులకు ఎరువుల పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు భూమిలోని పోషకాలన్నీ మొక్కలకు లభ్యమవుతాయి. పురుగుల ఉద్ధృతి నుంచి కాపాడుకోవచ్చు. - సుస్మిత

కళాశాలలోనే ...



మట్టి పరీక్షలు చేయించుకునేందుకు ఆసక్తి ఉన్న రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లోని మట్టి నమూనాలతో నేరుగా కళాశాలకు తీసుకురావచ్చు. ఎలా సేకరించాలనే దానిపై స్థానిక వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదిస్తే వివరిస్తారు. పరీక్షించి వెంటనే ఫలితాలు ఇచ్చేలా చూస్తాం. - సోని

పాఠ్యాంశాల్లో నేర్చుకున్నాం



నాలుగో సంవత్సరం పాఠ్యాంశాల్లో భాగంగా కళాశాలలో మట్టి నమూనాల సేకరణ, ఫలితాల విశ్లేషణ తదితర వాటిపై అధ్యాపకులు శిక్షణ ఇచ్చారు. మా కళాశాలలోని ప్రయోగశాలలో మట్టి, సాగు నీటి పరీక్షలకు సరిపడా రసాయనాలు ఉన్నాయి. సూక్ష్మపోషకాలపై పూర్తిస్థాయిలో అధ్యయనం కావాలంటే హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయానికి పంపుతాం. - అభిరాం

నేడే లక్ష్మీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం

న్యూస్‌టుడే, సిరిసిల్ల (విద్యానగర్)

సిరిసిల్లలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 9న స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలో గురువారం జరిగే రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రంలోనే ఎత్తైన రథం ఇక్కడి ప్రత్యేకత. స్థానికులు ఎక్కడ ఉన్నా బ్రహ్మోత్సవాలకు తప్పకుండా హాజరవుతారు. ఏటా వేల సంఖ్యలో భక్తులు రథోత్సవానికి తరలివస్తారు.

● గురువారం ఉదయం 5 గంటలకు రథ హోమం, ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రథంపై స్వామివారి దర్శనం, మొక్కుల చెల్లింపు, సాయంత్రం పట్టణ పురవీధుల గుండా స్వామివారి ఊరేగింపు ఉంటుంది.

● రాత్రి 8 గంటలకు నిత్యహోమం, నివేదన, తీర్థప్రసాద వితరణ జరుగుతాయి. రాత్రి 10 గంటలకు అశ్వవాహనంపై డోపుకథ ఉంటుంది.

● ఉత్సవానికి రథాన్ని సిద్ధం చేశారు. క్యూలైన్లు, తాగునీరు తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు. వేంకటేశ్వర దేవాలయం నుంచి గాంధీ చౌక్ వరకు జరిగే జాతరకు విక్రయదారులు దుకాణాలను ఏర్పాటు చేశారు.


సిద్ధమైన రథం

ఏర్పాట్లు పూర్తి చేశాం



సిరిసిల్లలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం జరిగే రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వేల సంఖ్యలో భక్తులు హాజరవుతారని అంచనా. ఉదయం 5 గంటల నుంచి రథంపై స్వామివారిని దర్శించుకోవచ్చు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. - మారుతి, ఆలయ ఈవో

ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోండి

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఆర్డీవో రాజేశ్వర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్-2025 ఓటరు జాబితా డ్రాఫ్టు పబ్లికేషన్ 29.10.2024 చేయడం జరుగుతుందని తెలిపారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. 01.11.2024 నాటికి డిగ్రీ చదివి మూడేళ్లు పూర్తయిన వారు ఫారం-18 ద్వారా, ఉపాధ్యాయులు ఫారం-19 ద్వారా ఓటరు నమోదు కోసం 06.11.2024 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ మహేశ్‌కుమార్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎ.నిత్యానందరావు, పి.నరేందర్, పి.హన్మాండ్లు, బి.కృష్ణ, రామస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే ప్రభుత్వ ధ్యేయం

వేములవాడ, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి వ్యవసాయం చేసే రైతన్నను రాజు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ మండలంలోని రుద్రవరం ఆర్అండ్ఆర్ కాలనీలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవనాన్ని బుధవారం విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకుల ద్వారా గ్రామాల్లో ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. బ్యాంకుల ఛైర్మన్లు, పాలక వర్గాలు అంకితభావంతో పని చేయడంతోనే బ్యాంకులు ఉన్నత స్థాయికి ఎదిగాయని తెలిపారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా పోటీ పడి సహకార బ్యాంకులు ముందుకు వస్తున్నాయన్నారు. స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు అందిస్తూ రైతుకు బాసటగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ముంపు గ్రామాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గతంలో ముంపు గ్రామాల్లో బస చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ముంపు గ్రామాలపై పూర్తి అవగాహన ఉందని, త్వరలోనే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేడీసీసీబీ ఛైర్మన్ కొండూరి రవీందర్ రావు, పీఏసీఎస్ ఛైర్మన్లు కృష్ణదేవరావు, ఏనుగు తిరుపతిరెడ్డి, సల్మాన్‌రెడ్డి, డైరెక్టర్లు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.


రుద్రవరంలో పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, కేడీసీసీబీ ఛైర్మన్ రవీందర్‌రావు తదితరులు

దరఖాస్తుల గడువు పొడిగింపు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: 2024-25 విద్యా సంవత్సరంలో విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా నిర్వహిస్తున్న అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఈ నెల 29 లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నాణ్యమైన విద్య అందించాలి

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారికి నాణ్యమైన విద్యతోపాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ పేర్కొన్నారు. బుధవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గది భవనం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో కొత్తగా 6 గదులు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. టాయిలెట్స్ మరమ్మతు చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలోని అన్ని తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు ఉండేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనశాలను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల పరిసరాలను వెంటనే శుభ్రం చేయాలని ఎంపీవోను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శంకర్‌నారాయణ, వెంకటేశ్వరస్వామి, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినిని ప్రశ్నలు అడుగుతూ జవాబులు రాబడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

మీపై గురుతర బాధ్యత!

- విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు
- సర్కారు బడుల బలోపేతానికి కృషి చేయాలి

న్యూస్‌టుడే- కరీంనగర్ విద్యావిభాగం



డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారు బుధవారం విధుల్లో చేరారు.. తొలిరోజు విద్యార్థులకు పాఠాలు బోధించి తమ ఇన్నేళ్ల కష్టానికి ఫలితం దక్కిందని ఆనందపడ్డారు.. ఉద్యోగం కోసం అహర్నిశలు కష్టపడి అనుకున్న లక్ష్యాన్ని సాధించిన మీరు.. భావి పౌరులుగా ఎదిగే విద్యార్థులకు మార్గదర్శకులు కావాలి.. సర్కారు బడుల బలోపేతానికి.. పేద, మధ్య తరగతి పిల్లలకు నాణ్యమైన విద్య అందడానికి మీ వంతు కృషి చేయాలి.. నిత్యం పాలనా విధులతో తీరిక లేకుండా ఉండే నాలుగు జిల్లాల కలెక్టర్లు విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. వినూత్న కార్యక్రమాలతో ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేస్తున్నారు. మీరు ఈ క్రతువులో భాగస్వాములు కావాలి.. ప్రభుత్వ పాఠశాలలు మరింత మెరుగవడానికి మీరు చొరవ చూపాలి..

ఉమ్మడి జిల్లాలో..
- మొత్తం ప్రభుత్వ పాఠశాలలు..: 2,465
- విద్యార్థులు : 1,65,691
- పని చేస్తున్న ఉపాధ్యాయులు : 10,078
- కొత్తగా నియమితులైనవారు : 692

బడి బాట పట్టేలా..

చదువుకోవాల్సిన వయసులో పలు కారణాలతో బాలలు బడులకు దూరంగా ఉంటున్నారు. గత జనవరిలో విద్యాశాఖ చేపట్టిన సర్వేలో ఉమ్మడి జిల్లాలో బడి బయట బాలలు 1,185 మంది ఉన్నట్లు గుర్తించారు. చదువు విలువ తెలిసిన మీరు మీ బడుల పరిధిలో చదువుకు దూరమైన బాలలు బడిలో చేరేలా చూడాలి. తల్లిదండ్రులకు చదువు విలువపై అవగాహన కల్పించాలి. వలస కుటుంబాల్లోని బాలలు పనుల వైపు మళ్లకుండా అక్షర జ్ఞానం కల్పిస్తే వారి గుండెల్లో మీరు చిరస్థాయిగా నిలిచిపోతారు.

బోధనలో నూతన ఒరవడి

ప్రపంచం వేగంగా మారిపోతోంది.. కొత్త ఆలోచనలతో ముందుకు సాగే విద్యార్థులే ఈ పోటీలో దూసుకెళ్తున్నారు.. మీ పరిధి విద్యార్థులు బట్టీ చదువులకు పరిమితం కాకుండా కొత్త ఆలోచనలు చేసేలా ప్రోత్సహించాలి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పలు సామర్థ్య పరీక్షల్లో వెనుకంజలో నిలుస్తున్నారు. బడుల్లో కృత్యాధార బోధనను అమలు చేస్తున్నా పూర్తి స్థాయిలో ఫలితం ఇవ్వడం లేదు. కొత్తగా చేరిన మీరు సిలబస్ పూర్తి చేశామా.. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేశామా అన్న దానికే పరిమితం కావొద్దు. మీరు చెప్పింది విద్యార్థులు ఎంత వరకు అర్థం చేసుకున్నారు. వారు ఏం నేర్చుకున్నారనేదానిపై దృష్టి పెడితేనే మీ బోధనకు సార్థకత. చెప్పడం కంటే చూసి నేర్చుకుంటే విద్యార్థులు మరిచిపోరు. కృత్యాధార బోధనకు పెద్దపీట వేయాలి. ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంత పరిజ్ఞానంతో బోధన పరికరాలు తయారు చేసుకుని నూతన ఒరవడితో బోధన సాగించాలి.


గంగాధర మండలం కురిక్యాల ప్రాథమిక పాఠశాలలో తొలిరోజు బాలలకు బోధిస్తున్న కొత్త ఉపాధ్యాయురాలు

మంచి అలవాట్లు నేర్పించండి..

స్మార్ట్‌ఫోన్‌లకు అన్ని వయసుల వారు బానిసలవుతున్నారు. మీ పరిధి విద్యార్థులు చరవాణులకు బానిసలు కాకుండా వారికి మంచి అలవాట్లు నేర్పించండి. పాఠాలు చదవడానికే పరిమితం చేయకుండా స్ఫూర్తిదాయక వ్యక్తుల జీవిత చరిత్రలు, మంచి సాహిత్యం చదివేలా ప్రోత్సహించండి. చదువు తరవాత ఆటపాటలు, మంచి పుస్తక పఠనం అలవాటు చేస్తే వారు జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడినవారవుతారు.

భరోసానివ్వండి..

మీ బడిలో చదివే విద్యార్థులకు మీరున్నారన్న భరోసానివ్వండి. ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెస్తున్న కొందరు గురువులు.. తోటి విద్యార్థులు బాలికలను వేధిస్తున్న ఘటనలు అక్కడక్కడా చోటుచేసుకుంటున్నాయి.. ఎవరినైనా ఇలా వేధిస్తే వెంటనే మీకు చెప్పేలా ధైర్యం చెబితే వారు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు పంచుకుంటారు. అప్పుడు ఇలాంటి వేధింపులను మొదట్లోనే తుంచివేయొచ్చు. విద్యార్థులకు చదువు ఒక్కటే కాదు క్రమశిక్షణ, దేశభక్తి, ఆత్మగౌరవం నేర్పించడంపైనా దృష్టి పెట్టాలి. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్పించాలి. అప్పుడే మీరు ఉపాధ్యాయ వృత్తిని పరిపూర్ణత తెచ్చినవారు అవుతారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించండి

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీసులు విధులు నిర్వర్తించాలని, గ్రామాల్లో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లను బుధవారం సందర్శించారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. సర్కిల్ పరిధిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు, విచారణలో ఉన్న కేసులు, ట్రయల్ కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, రికార్డులు, వర్టికల్స్ అమలు తీరు, స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది కిట్స్‌ను పరిశీలించారు. ఠాణా పరిసరాలను పరిశీలించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి విచారణ చేపట్టి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. నేరాల నియంత్రణకు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని పేర్కొన్నారు. పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలను నెలకొల్పాలని చెప్పారు. గ్రామాలకు సంబంధించిన పూర్తి వివరాలు వీపీవోల వద్ద ఉండాలన్నారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై రమాకాంత్ శిక్షణ ఎస్సై రాహుల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ధాన్యం సేకరణకు 258 కొనుగోలు కేంద్రాలు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం సేకరణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, జిల్లాలో 258 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర, వెంకటాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ ఛైర్పర్సన్ సాబేరాబేగం, పీఏసీఎస్ ఛైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి తదితరులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, నాణ్యతతో కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్‌కార్డులను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. డీఆర్డీవో శేషాద్రి, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, పౌరసరఫరాలశాఖ అధికారి వసంతలక్ష్మి, ఎంపీడీవో సత్తయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మార్కెటింగ్ ఇన్‌ఛార్జి డీపీఎం శ్రీనివాస్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాంరెడ్డి పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిపేటలో ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తదితరులు

అరకొర వసతులు.. అన్నదాత అవస్థలు

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాల కరవు

న్యూస్‌టుడే, కోనరావుపేట

ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అన్నదాతలు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అయితే అక్కడ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రాల ప్రారంభానికి ముందు ధాన్యం రాశులుగా పోయడానికి వీలుగా పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించి చదును చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో కేంద్రాల్లో నెలకొన్న సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.


నిజామాబాద్ కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 1.70 లక్షల పైగా ఎకరాల్లో వరిసాగు చేశారు. 3 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 25 వేల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

● పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202, ఐకేపీ ఆధ్వర్యంలో 44, డీసీఎంఎస్ 8, మెప్మా 4 మొత్తం 258 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

● ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం తేమశాతం 17 ఉండాలి. క్వింటాల్‌కు ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300, సన్నరకానికి మద్దతు ధరతో పాటు రూ.500 అదనంగా బోనస్ ప్రభుత్వం ప్రకటించింది.

ఇవి కల్పించాలి...

రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వ నిబంధనల మేరకు శుభ్రం చేయడానికి కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు వెంటాడుతున్నాయి.

● కేంద్రాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు లేకుండా తొలగించి చదును చేయించాలి.

● అకాల వర్షం, తేమశాతం బారిన పడకుండా కాపాడుకోవటానికి సరిపడా టార్పాలిన్లను ప్రభుత్వం సమకూర్చాలి.

● ధాన్యం శుద్ధి చేయటానికి ప్యాడీ క్లీనర్, తేమ శాతం సరిచూసే పరికరాలు అందుబాటులో ఉంచాలి.

● శుద్ధజలంతోపాటు సేదదీరడానికి పూరి గుడిసెలు ఏర్పాటు చేయాలి.

● విద్యుత్తు దీపాలు లేక అంధకారం నెలకొంది. రాత్రి వేళ వాచ్‌మెన్ అందుబాటులో లేక ధాన్యం దొంగతనానికి గురయ్యే ప్రమాదం ఉంది.

పది రోజులు అయింది



నేను వానాకాలంలో 8 ఎకరాల్లో వరి సాగు చేశాను. పది రోజుల క్రితం 3 ఎకరాల్లోని ధాన్యం తీసుకొచ్చి కొనుగోలు కేంద్రంలో పోశాను. సేకరణ ప్రారంభిస్తే తేమశాతం వచ్చిన ధాన్యం తూకం వేయడానికి అవకాశం ఉంటుంది. కొందరు రైతులు కేంద్రాలు ప్రారంభించకపోవటంతో మధ్యదళారులు, మిల్లర్లకు రూ.1900 నుంచి రూ.2000 విక్రయిస్తున్నారు. మెరుగైన వసతులు కల్పించి తూకాల్లో జాప్యం లేకుండా చూడాలి.
- ఎర్ర దేవయ్య, రైతు, ధర్మారం

రెండు మండలాల్లో ప్రారంభం

జిల్లాలో ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి బుధవారం ప్రారంభించాం. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించేలా చూడాలని పీఏసీఎస్ సీఈవోలకు ఆదేశాలు జారీ చేశాం. రైతులు నిబంధనల మేరకు ధాన్యం తీసుకురావాలి. కొనుగోలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటాం. - రామకృష్ణ డీసీవో

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
వీర్నపల్లి: 91541 18151
బోయినపల్లి: 84999 90001

న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్

? సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో సులభ్ కాంప్లెక్స్ ఎదుట ప్రధాన కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో మురుగు ముందుకు వెళ్లడం లేదు. ఈగలు, దోమల బెడద పెరిగి దుర్గంధం వస్తోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.
- విజయ్ రాథోడ్, పాత బస్టాండ్

✔ పారిశుద్ధ్య కార్మికులకు చెప్పి కాలువలోని చెత్తాచెదారం వెంటనే తొలగిస్తాం. **- రఘు, పారిశుద్ధ్య విభాగం ఇన్‌ఛార్జి, పాత బస్టాండ్ ప్రాంతం**

న్యూస్‌టుడే, ముస్తాబాద్

? ముస్తాబాద్ శివారులోని ఎస్సీ కాలనీ సమీపంలో చెత్తాచెదారం వేస్తున్నారు. దుర్గంధం రావడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.
- బాబు, స్థానికుడు

✔ క్షేత్రస్థాయిలో పరిశీలించి చెత్తాచెదారం వేయకుండా చర్యలు చేపడతాం. **- రమేశ్, ఈవో, ముస్తాబాద్**

గుంత పూడ్చివేత

ఈనాడు స్పందనకు వందనం

కోనరావుపేట, న్యూస్‌టుడే: కోనరావుపేట మండల కేంద్రం శివారులోని కల్వర్టు వద్ద ప్రమాదకరంగా మారిన గుంతను దసరా కమిటీ సభ్యులు కంకర పోయించి పూడ్చివేయించారు. ఈనెల 15న 'ఈనాడు'లో 'అధికారుల నిర్లక్ష్యం... పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన దసరా ఉత్సవ కమిటీ సభ్యులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో వాహనాల రాకపోకలకు సౌకర్యంగా మారింది.


గుంతను పూడ్చివేయిస్తున్న కమిటీ సభ్యులు

పట్టభద్రుల వాణి వినిపిస్తా

బోయినపల్లి, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనకు అవకాశం కల్పిస్తే శాసనమండలిలో పట్టభద్రుల వాణి వినిపించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సహాయ ఆచార్యుడు పులి ప్రసన్న హరికృష్ణ తెలిపారు. పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు కేంద్రాన్ని బుధవారం పట్టభద్రులతో కలిసి ప్రారంభించారు. విధిగా ఓటరుగా నమోదు కావడంతోపాటు తమ ఓటు హక్కు ఎన్నికల్లో వినియోగించుకోవాలని సూచించారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు. ఎమ్మెల్సీ స్థానం పరిధిలో పట్టభద్రులను కలిసి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగ యువత, స్థానికులు హరికృష్ణను సన్మానించి మద్దతు తెలిపారు.


బోయినపల్లిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న హరికృష్ణ తదితరులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండలం బంజేరు గ్రామానికి చెందిన గుగులోతు సుభాష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా హెల్పింగ్ హ్యాండ్స్ 2కె వీర్నపల్లి స్వచ్ఛంద సంస్థ సభ్యులు బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. మృతుడి కుమార్తె సోనాక్షి పేరిట రూ. 10 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎన్.రాజు, లెంకల రాజు, చంద్రమౌళి, కనకరాజు, కొమ్ము తిరుపతి, నక్క శ్రీనివాస్, జనార్దన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం డీఏలు మంజూరు చేయాలి

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వం దీపావళి కానుకగా డీఏలను మంజూరు చేయాలని పీఆర్‌టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు మానువాడ శంకర్ ఓ ప్రకటనలో కోరారు. డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయులను నియమించినందుకు ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులకు రావాల్సిన అయిదు పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని పేర్కొన్నారు. నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితిలో పీఆర్సీ ప్రకటించాలని, డీఏలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఏజీపీగా కృష్ణ

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌కు చెందిన న్యాయవాది పసుల కృష్ణను అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేటలో కాంగ్రెస్, భారాస నాయకులు బుధవారం సాయంత్రం ఆయనను ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ వైస్ ఛైర్మన్ గుండాడి రాంరెడ్డి, నాయకులు మల్లేశం యాదవ్, పిల్లి కిషన్, పుణ్యనాయక్, ప్రభునాయక్ తదితరులు పాల్గొన్నారు.


కృష్ణను సన్మానిస్తున్న నాయకులు

రుద్రంగి: వేములవాడ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన పుప్పాల భానుకృష్ణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఏజీపీగా మూడేళ్ల పాటు సేవలు అందించనున్నారు. భానుకృష్ణ నియామకం పట్ల రుద్రంగి మండల మాజీ ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.


భానుకృష్ణ

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని సీఐ మొగిలి పేర్కొన్నారు. బుధవారం ఇల్లంతకుంట మండలంలోని సిరికొండ గ్రామంలో మీకోసం కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సీసీ కెమెరాల వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని, వీటివల్ల నేరాలను ఛేదించడం సులువు అవుతుందన్నారు. సీసీ కెమెరాలు ఉండటం వల్ల నేరాలు చేయడానికి భయపడతారన్నారు. సీసీ కెమెరాలతో కేసులను ఛేదించడం జరిగిందన్నారు. కేసులకు సంబంధించిన సాక్ష్యాలకు ఉపయోగపడతాయని చెప్పారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. సైబర్ నేరాలు, గంజాయి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి నిధులు

గంగాధర, న్యూస్‌టుడే: చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రహదారుల నిర్మాణానికి రూ.15 కోట్ల నిధులు కేటాయించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆ నిధులను మంజూరు చేయించారని, గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్ తెలిపారు. ఇందులో బోయినపల్లి మండలం రామన్నపేట-లక్ష్మీపూర్ రహదారికి రూ.3 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.

పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై కళా ప్రదర్శన

మరిమడ్ల (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం మరిమడ్లలో కలెక్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథి పొత్తూరి రాజు ఆధ్వర్యంలో బుధవారం కళా ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పల్లె దవాఖానాలకు మోక్షమెప్పుడో?

న్యూస్‌టుడే, గంభీరావుపేట

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం పల్లె దవాఖానాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. గంభీరావుపేట మండలానికి నాలుగు మంజూరు కాగా అందులో రెండు నిర్మాణం పూర్తయ్యాయి. మరో రెండు చోట్ల పనులు ప్రారంభం కాలేదు. నిర్మించిన వాటిని కూడా గుత్తేదారు అప్పగించకపోవడంతో నిరుపయోగంగా మారాయి.


దమ్మన్నపేటలో నిర్మించిన పల్లె దవాఖానా

గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు దమ్మన్నపేట, ముస్తఫనగర్, లింగన్నపేట గ్రామాల్లో పల్లె దవాఖానాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు దమ్మన్నపేటలో నిర్మాణాలు పూర్తి చేశారు. ఇందులో గంభీరావుపేట పల్లె దవాఖానాను సర్పంచుల పదవీ కాలం ఉన్న సమయంలోనే గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచి కటకం శ్రీధర్ పంతులు చేతుల మీదుగా ప్రారంభించారు.

● దమ్మన్నపేట పల్లె దవాఖానాను ఇప్పటి వరకు ప్రారంభించలేదు. నిర్మాణం పూర్తయి 20 నెలలు దాటిపోతున్నా ఇప్పటి వరకు ప్రారంభించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● ముస్తఫనగర్, లింగన్నపేట గ్రామాల్లో నిధులు మంజూరైనా ఇప్పటి వరకు పనులను ప్రారంభించలేదు. వెంటనే పనులను ప్రారంభించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణం పూర్తయిన చోట వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా మిగతా వాటిని పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అలంకారప్రాయంగా ఉంది



గంభీరావుపేట మండల కేంద్రంలో ప్రారంభించిన పల్లె దవాఖానాలో వైద్య సేవలు అందించాలి. వెంటనే ఉపయోగంలోకి తీసుకురావాలి. విద్య, వైద్యం పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దు. నిర్మించి నిరుపయోగంగా ఉంచడం వల్ల ప్రయోజనం లేదు. గంభీరావుపేటలో అద్దె భవనంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రంలో అన్ని వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే దవాఖానాను ఉపయోగంలోకి తీసుకురావాలి.
- రంజిత్ కుమార్, గంభీరావుపేట

త్వరలోనే వైద్య సేవలు

దమ్మన్నపేట, గంభీరావుపేటలో నిర్మించిన పల్లె దవాఖానాల భవనాలను గుత్తేదారు ఇప్పటి వరకు మాకు అప్పగించలేదు. గంభీరావుపేటలో ప్రారంభించినప్పటికీ దానిని కూడా అప్పగించలేదు. పంచాయతీరాజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే రెండు గ్రామాల్లో వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం.
- వేణుగోపాల్‌రెడ్డి, లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైద్యాధికారి

రహదారులపై ధాన్యం ఆరబెట్టవద్దు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్ 2024 ధాన్యం కొనుగోలును పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఖరీఫ్ సీజన్ 2024 ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందన్న అంచనా వేసినట్లు వెల్లడించారు. రోడ్లమీద ధాన్యం ఆరబెట్టి, రోడ్డు ప్రమాదాలకు దారి తీయకుండా చూడాలన్నారు. రైతులు టోకెన్ పద్ధతిలో మాత్రమే ధాన్యం తీసుకొచ్చి కొనుగోలు చేసే విధంగా చూడాలని పేర్కొన్నారు. ధాన్యం రవాణాకు ఇబ్బందులు కాకుండా ప్రతి సెంటర్‌కు సరిపడా వాహనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఆర్డీవో శేషాద్రి, పౌరసరఫరాల అధికారి వసంత లక్ష్మి, డీఎం రజిత, డీసీఓ రామకృష్ణ, ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారి రామారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


బోయినపల్లి: సమావేశంలో ఛైర్మన్, డైరెక్టర్లు

కొనుగోళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

సిరిసిల్ల కలెక్టరేట్: 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఆర్డీవో శేషాద్రి పేర్కొన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై ఏపీఎంలు, సెంటర్ ఇన్‌ఛార్జులు, బుక్‌కీపర్లు, కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాడీ క్లీనర్ ద్వారా పట్టిన ధాన్యాన్ని సంబంధిత ఏఈఓ సర్టిఫై చేసి ధాన్యం సన్నరకం, దొడ్డు రకం వేర్వేరుగా మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. కేటాయించిన మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని పంపించాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలలో తాగునీరు, నీడ సౌకర్యం ఉండే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో జి.శ్రీనివాస్, ఎం.సుధారాణి, ఎం.శ్రీనివాస్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్ల: మాట్లాడుతున్న డీఆర్డీవో శేషాద్రి

ఆవునూర్ (ముస్తాబాద్): రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్, గూడెం గ్రామాల్లో ధాన్య కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చేటప్పుడు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డులు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో శేషాద్రి, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, పౌరసరఫరాల అధికారిణి వసంత, పీఏసీఎస్ ఛైర్మన్ తన్నీరు బాపురావు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ తలారి రాణి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుండం నర్సయ్య, ఐకేపీ ఏపీఎం దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోయిని ఎల్లేశ్ యాదవ్ తెలిపారు. ఛైర్మన్ అధ్యక్షతన పాలకవర్గ సాధారణ సమావేశం బుధవారం నిర్వహించారు. కార్యాలయంలో రూ.10 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. కూలిన ప్రహరీ నిర్మాణం, గోదాంలో మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాలకు ఎంఎస్‌పీ పరికరాలు పంపించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, డైరెక్టర్లు, కార్యదర్శి పాల్గొన్నారు.

కల్యాణం... కమనీయం

ముస్తాబాద్, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముస్తాబాద్ మండల కేంద్రంలోని గ్రామచావడిలో పార్వతి పరమేశ్వరులు, శ్రీ లక్ష్మీపార్వతి వేంకటేశ్వరస్వామిల కల్యాణాన్ని బుధవారం రాత్రి అర్చకులు కనుల పండుగా నిర్వహించారు. ముందుగా అర్చకులు హరీశ్ శర్మ, పార్థసారథిలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు ఎదుర్కోళ్లు నిర్వహించారు. తరవాత కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. గురువారం రథోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎల్సాని దేవయ్య తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


ముస్తాబాద్‌లో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆధ్యాత్మికం

దుర్గామాత నిమజ్జనం

ముస్తాబాద్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రులు పూజలందుకున్న దుర్గామాత నిమజ్జన వేడుకలు ముస్తాబాద్ మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో మండపాలకు చేరుకొని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం దుర్గామాత శోభాయాత్ర యూత్ సభ్యుల ఆటపాటలతో కనులపండువగా సాగింది. తరవాత అమ్మవారి విగ్రహాలను పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. యూత్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


శోభాయాత్రలో నృత్యం చేస్తున్న యువకులు

ఘనంగా కోజాగరి పౌర్ణమి వేడుకలు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి కోజాగరి పౌర్ణమి వేడుకల (మహాలక్ష్మి పూజ, క్షీరచంద్ర పూజ)ను స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి 10.05 గంటల నుంచి దాదాపు రెండు గంటల పాటు ఆలయ ప్రాంగణంలో అర్చకుల వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, అర్చకులు పాలలో చంద్రుడిని దర్శించుకుని తరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: పట్టణాభివృద్ధికి సిరిసిల్ల పురపాలక సంఘం కృషి చేస్తుందని ఛైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. సిరిసిల్లలోని 18వ వార్డులో బుధవారం సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గడ్డం చందన తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజలో ఛైర్‌పర్సన్ కళ తదితరులు

విద్యార్థిని కొట్టిన ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థి తలపై విచక్షణారహితంగా ఉపాధ్యాయుడు కొట్టిన సంఘటన సామాజిక మాధ్యమంలో బుధవారం వైరల్ అయింది. ఉపాధ్యాయుడు కొట్టిన దెబ్బకు విద్యార్థి చెవి నుంచి రక్తం కారడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. తల్లిదండ్రులు సదరు ఉపాధ్యాయుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ విషయం బయటకు పొక్కకుండా పాఠశాల యాజమాన్యం జాగ్రత్త పడి విద్యార్థి తల్లిదండ్రులతో రాజీకి ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఎంఈవో బన్నాజీని సంప్రదించగా అలాంటి సంఘటన జరిగినట్లు తమ దృష్టికి రాలేదని, విచారణ చేస్తామని తెలిపారు.

ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతరకు ఆహ్వానం

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతరకు ఇల్లంతకుంట మండలంలోని ముస్కానిపేట గ్రామానికి చెందిన ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు తునికి తిరుపతికి ఆహ్వానం అందింది. అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతి సేవా సమితి శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతర పేరుతో ఈ నెల 19, 20 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో జరిగే కవి సమ్మేళనానికి ఆహ్వానం అందినట్లు తిరుపతి తెలిపారు. కవితాగానం, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం చేయడానికి శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, కన్వీనర్ రమాపతి, ప్రధాన కార్యదర్శి పార్థసారథి ఆహ్వానం పంపినట్లు తెలిపారు.



తిరుపతి

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

గంభీరావుపేట, న్యూస్‌టుడే: గంభీరావుపేట మండలంలోని సముద్రలింగాపూర్‌కు చెందిన మల్లారపు ప్రవళికకు ముఖ్యమంత్రి సహాయనిధి రూ. 60 వేలు మంజూరైంది. ఈ చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్‌తో పాటు నాయకుల చేతుల మీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు కూరెల్లి రాంచంద్రం, భాస్కర్, మోహన్, విఠల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఫీజు రీయింబర్సుమెంట్ విడుదలకు డిమాండ్

సిరిసిల్లగ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్సుమెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని భారాసవి రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదని, ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించలేదన్నారు. ఫీజు రీయింబర్సుమెంట్, ఉపకార వేతనాలు చెల్లించకుండా విద్యార్థులను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారాసవి జిల్లా నాయకులు మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేశ్, నారోజు వెంకటేశ్, ముద్దం అనిల్‌గౌడ్, సాయి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భారాసవి రాష్ట్ర నాయకుడు రవిగౌడ్

కొత్త ఉపాధ్యాయులకు పోస్టింగ్

సిరిసిల్ల (విద్యానగర్): ఇటీవల డీఎస్సీలో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు పోస్టింగులు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలోని 151 ఖాళీలకు గాను 132 మంది ఎంపికవగా, మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. బుధవారం నూతన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలలో చేరి విద్యార్థులకు పాఠాలు బోధించారు. జిల్లాలో మొత్తం 109 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రభుత్వ ఉన్నత, 390 మండల పరిషత్ ప్రాథమిక, 39 మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు కలిపి మొత్తం 490 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.


తొలిరోజు పాఠం బోధిస్తున్న నూతన ఉపాధ్యాయిని

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలోని శాత్రాజుపల్లి రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహారం ప్రాముఖ్యత, వాటిలోని పోషక విలువలు, జంకు ఫుడ్ తినడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ విద్యార్థులు పోస్టర్ల ద్వారా వివరించారు. మోడల్స్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస రామలింగేశ్వరశర్మ, వైస్ ప్రిన్సిపల్ కె.లావణ్య, ఆర్.దీప్తి, అయేషా ఫాతిమా, జి.స్వప్న, విద్యార్థినులు పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంక్ శాఖ ప్రారంభం

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జోనల్ హెడ్ ధారాసింగ్ ముఖ్య అతిథిగా హాజరై బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ హెడ్ కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.


బ్యాంక్ ప్రారంభోత్సవంలో ధారాసింగ్ తదితరులు

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న విప్ దంపతులు

వేములవాడ, న్యూస్‌టుడే: వరంగల్‌లోని శ్రీ భద్రకాళి అమ్మవారిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్లపై ధాన్యం పోస్తే చర్యలు

చందుర్తి, న్యూస్‌టుడే: రోడ్లపై పోసిన ధాన్యం ప్రమాదాలకు కారణం అవుతున్నాయని, పోసిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గతంలో రహదారులపై ధాన్యం ఆరబోయడం వల్ల ఇద్దరు రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం చెందారని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి రెవెన్యూ అధికారులు సూచించిన స్థలాల్లో ఆరబోసుకోవాలని సూచించారు. చందుర్తి నుంచి గోవిందారం వెళ్లే మార్గంలో పోసిన ధాన్యం కుప్పలను చందుర్తి తహసీల్దారు శ్రీనివాస్‌తో కలిసి సీఐ సందర్శించి, రైతులకు తగు సూచనలు చేశారు.

ఎగువమానేరు జలాశయంలో దూకి కూలీ ఆత్మహత్య

గంభీరావుపేట, న్యూస్‌టుడే: అప్పుల బాధ భరించలేక జలాశయంలో దూకి కూలీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువమానేరు జలాశయం వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... కామారెడ్డి జిల్లా పల్వంచ మండలం ఇసాయిపేట గ్రామానికి చెందిన గుడ్లపల్లి ప్రకాశ్ (55)కు భార్య నాగలక్ష్మి, ఒక కొడుకు, కూతురు ఉన్నారు. రెండు సంవత్సరాల క్రితం పల్వంచ మండలంలోని వెల్పుగొండకు వచ్చి జీవిస్తున్నారు. ప్రకాశ్ కూలీ పని చేస్తూ జీవనం కొనసాగించగా ఇటీవల కూతురు వివాహం చేశాడు. అనారోగ్య సమస్యలు ఉన్నాయి. ఈక్రమంలో బంధువుల వద్ద, తెలిసిన వారి వద్ద అధిక మొత్తంలో అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలోనని బాధపడుతుండేవాడు. ఈ నెల 15న పనికి వెళ్లి రాత్రి అయినా ఇంటికి రాకపోయే సరికి చుట్టు పక్కల వెతికారు. ఉదయం ఎగువమానేరు వద్ద దుస్తులు, చెప్పులు ఉండటంతో జలాశయంలో చూశారు. అందులో మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. జాలర్ల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీసి శవపరీక్ష కోసం పంపించారు. అప్పుల బాధతో తన భర్త మానేరు జలాశయంలో పడి ఆత్మహత్య చేసుకున్నాడని నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.


ప్రకాశ్

నేర వార్తలు

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

గంభీరావుపేట, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బండెల రాజయ్య (56) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ నెల 15న మక్తనాయక్ తండాకు పని మీద వెళ్లాడు. సాయంత్రం 6.15 గంటల సమయంలో సైకిల్‌పై తిరిగి వస్తున్నాడు. సిరిసిల్ల నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ముందు నుంచి వెళ్తున్న రాజయ్య సైకిల్‌ను ఢీకొట్టడంతో ఒక్కసారిగా ఎగిరి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనం అక్కడి నుంచి వెళ్లిపోయింది. అటుగా వెళ్తున్న ఓ ప్రయాణికుడు చూసి రాజయ్య కొడుకు అనిల్‌కు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకొన్నాడు. అప్పటికే మృతి చెందాడు. బుధవారం అనిల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ గొర్రెల కాపరి...

బోయినపల్లి, న్యూస్‌టుడే: మల్కాపూర్ గ్రామానికి చెందిన నర్సయ్య (50) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... నర్సయ్య గొర్రెలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. వివాహం జరిగి 18 ఏళ్లు గడిచినా సంతానం కావడం లేదని తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. నర్సయ్య భార్య మంజుల పండగకు ఊరు వెళ్లడంతో ఈనెల 15న పురుగు మందు తాగాడు. నర్సయ్యను గమనించి అతని అన్న కొడుకు రాకేశ్ మంజులకు సమాచారం అందించి ఆసుపత్రికి తరలించాడు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నర్సయ్య మృతి చెందాడు. మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనగా ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు ప్రమాదానికి కారకుడైన సైదాపూర్ మండలం సోమారం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ రాజేశంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. బండలింగంపల్లికి చెందిన కొత్తపల్లి బాబు, కొత్తపల్లి వెంకటేశ్‌లు ద్విచక్రవాహనంపై సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వైపు వస్తుండగా కరీంనగర్‌కు వెళ్తున్న కారు ఢీకొట్టిందన్నారు. కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే ప్రమాదం చోటుచేసుకుందని పేర్కొంటూ కొత్తపల్లి బాబు భార్య అనసూర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న ఎస్సై పేర్కొన్నారు.

మత్తుతో బతుకులు చిత్తు!

గంజాయికి బానిసవుతున్న యువత

ఈనాడు, కరీంనగర్







■ కరీంనగర్‌లోని ఓ కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థి స్నేహితులతో కలిసి గంజాయికి అలవాటు పడ్డాడు. చేతి ఖర్చులకు రోజూ రూ.500 వరకు అడిగే పరిస్థితికి చేరాడు. కూలీనాలీ చేస్తూ కష్టపడే తల్లిదండ్రులు అడిగినన్ని డబ్బులు ఇవ్వకుంటే సామగ్రిని ధ్వంసం చేయడంతోపాటు తల్లిదండ్రులపై చేయిచేసుకోవడం మొదలు పెట్టాడు. బంధువుల చొరవ తీసుకుని కరీంనగర్‌లోని ఓ మానసిక వైద్యుడి దగ్గర చికిత్స చేయిస్తున్నారు.

■ జగిత్యాల జిల్లాలో గంజాయికి బానిసైన యువకులు కొందరు ఓ బాలికకు అలవాటు చేశారు. మైకంలో ఉన్న ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక తల్లిదండ్రులు ఆలస్యంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన ఏడాది కిందట సంచలనం రేకెత్తించింది.

ఉమ్మడి జిల్లాలో గంజాయి వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. ఓ వైపు పోలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నా వినియోగం మాత్రం ఆగడం లేదు. గంజాయి మత్తులో జోగుతున్న యువత తమ ఆరోగ్యం దెబ్బతీసుకోవడంతోపాటు నేరాలకు పాల్పడుతున్న ఘటనలు పోలీసులు గుర్తిస్తున్నారు. గొడవలకు దిగడం, చోరీలకు పాల్పడటమే కాకుండా వేగంగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న ఘటనలు కూడా ఉంటున్నాయి. కొందరు ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. ఏడాది వ్యవధిలో 200ల కిలోలకుపైగా గంజాయిని వివిధ ప్రాంతాల్లో పోలీసులు పట్టుకున్నారు. 100 మంది వరకు యువకులు, వారి కుటుంబీకులకు ఆయా ఠాణాల పరిధిలో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా పూర్తి స్థాయిలో అడ్డుకట్ట పడటం లేదు.



పలు ప్రాంతాల నుంచి..: ఉమ్మడి జిల్లాకు రాష్ట్రంలోని పలు పట్టణాలతోపాటు పక్క రాష్ట్రాల నుంచి గంజాయి వస్తోంది. పోలీసులకు పట్టుబడిన కేసులను బట్టి వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న గంజాయి ఇలా..



యువతే లక్ష్యంగా : పేద కుటుంబాలకు చెందిన యువతను గుర్తించి రవాణా కోసం వినియోగిస్తున్నారు. గంజాయికి బానిసలవుతున్నవారిలో ఎక్కువగా వారే అధికంగా ఉంటున్నారు. అమ్ముతూ.. లేదా తీసుకుంటూ పట్టుబడిన వారిలో 18 ఏళ్ల నుంచి 29 ఏళ్ల వయసున్న వారే ఉంటుండటం గమనార్హం. ఈ ఏడాది పట్టుబడిన వారిలో ఈ వయసు వారే 72 శాతం ఉంటున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

● కరోనాకు ముందు 2019లో నాలుగు జిల్లాల పరిధిలో అధికారికంగా పట్టుబడిన గంజాయి ఏడాది కాలంలో 30-40 కిలోలు ఉండేది. ఇప్పుడు ఏటా క్వింటాలు దాటుతుండటం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా మన్యం ప్రాంతం నుంచి ఉమ్మడి కరీంనగర్‌కు సరఫరా చేయడం పెరిగింది.

నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం:



గంజాయి వల్ల మనిషిలోని పలు అవయవాలు, నాడీ వ్యవస్థపై విపరీతమైన ప్రభావం పడుతుంది. మెదడు మొద్దుబారుతుంది. ఎక్కువ మోతాదులో తీసుకున్నప్పుడు ఏమి చేస్తున్నారో తెలియని పరిస్థితి ఉంటుంది. మత్తు వల్ల కళ్లకు విపరీతమైన హాని కలుగుతుంది. ఎర్రబడటంతోపాటు దృష్టిలోపం సమస్య ఎదురవుతుంది. బీపీ ఎక్కువవుతుంది. ఊపిరితిత్తులపైనా శ్వాస కోశ నాళాలపైన ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

- డాక్టర్ తిరుపతి, ఫిజిషియన్, కరీంనగర్

కర్ణాటక వసతి గృహాల దుప్పట్లు సిరిసిల్లలో ఉత్పత్తి

మూడు లక్షల మీటర్ల ఆర్డర్లు



గుత్తేదారుకు అప్పగించేందుకు సిద్ధం చేసిన దుప్పట్లు

ఈనాడు, సిరిసిల్ల: వస్త్రోత్పత్తుల ఖిల్లా సిరిసిల్లకు కర్ణాటక రాష్ట్రంలోని వసతి గృహాలకు అవసరమైన దుప్పట్ల ఆర్డర్లు వస్తున్నాయి. అక్కడి ప్రభుత్వం విద్యార్థులకు అందించే దుప్పట్ల ఆర్డర్లు పొందిన గుత్తేదారు ఇక్కడి ఆసాములచే ఉత్పత్తి చేయిస్తున్నారు. సిరిసిల్లలోని 68 ఇంచుల మరమగ్గాలున్న పది మంది ఆసాములు ఉత్పత్తి చేస్తున్నారు. నెలకు 40 వేల మీటర్ల చొప్పున మొత్తం మూడు లక్షల మీటర్ల లక్ష్యం. ఉత్పత్తి పూర్తయిన తర్వాత గార్మెంట్ పరిశ్రమలో మహిళలే కుట్టి గుత్తేదారుకు అప్పగిస్తున్నారు. ఒక్కో ఆసామికి ముడిసరకు అందించి మీటరుకు రూ.5 చొప్పున కూలీ మాత్రం చెల్లిస్తున్నారు. నాలుగు మరమగ్గాలు నడిపే ఆసామి ఒక షిఫ్టులో 200 మీటర్లు ఉత్పత్తి చేస్తారు. సగటున ఒక షిఫ్టునకు రూ.వెయ్యి కూలీ గిట్టుబాటు అవుతుంది. అలాగే గార్మెంట్‌పై కుట్టి ఇచ్చే మహిళలకు ఒక దుప్పటికి రూ.5 చెల్లిస్తున్నారు. ఇలా రోజుకు 50 చొప్పున రూ.250 గిట్టుబాటు అవుతుంది. వీటితో పరిశ్రమలోని ఆయా విభాగాల్లో 200 మంది ఉపాధి పొందుతున్నారు. మొత్తంగా 30 లక్షల మీటర్ల ఆర్డర్లు ఉన్నా ఆసాముల వద్ద పెట్టుబడి లేక తక్కువ మొత్తంలో తీసుకున్నారు. చేనేత, జౌళిశాఖ పెట్టుబడులకు పరిశ్రమ వర్గాలతో సంప్రదింపులు చేస్తున్నారు. ఇవి ఫలిస్తే భారీ మొత్తంలో మరిన్ని ఆర్డర్లతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. వీటితోపాటు ఝార్ఖండ్ ప్రభుత్వం పంపిణీ చేసే చీరల ఆర్డర్లు కూడా ఇప్పుడిప్పుడే పరిశ్రమకు వస్తున్నాయి.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో సత్తా



పతకాలు సాధించిన జిల్లా రెజ్లర్లు

కరీంనగర్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో ఈనెల 15, 16న జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్-19 కుస్తీ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆటగాళ్లు సత్తా చాటారు. రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు చెందిన పి.వినయ్‌కుమార్, టి.సిద్ధార్థలు రజత పతకాలు, బి.నరసింహ, కె.రాజరథన్, ఎన్.దినేష్‌లు కాంస్య పతకాలు సాధించారు. ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ జూనియర్ కళాశాల నుంచి కె.రాజు రజతం, కె.విజయ్ కాంస్య పతకం, వి.రఘు చరణ్ (అల్ఫోర్స్ జూనియర్ కళాశాల) కాంస్య పతకం, సి.హెచ్ ఆదిత్య మహారాజ్ (ట్రినిటీ) కాంస్య పతకం సాధించినట్లు రెజ్లింగ్ టీం కోచ్ ఎం.వంశీ కృష్ణ తెలిపారు. వీరిని తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, కళాశాలల క్రీడా సమాఖ్య కరీంనగర్ జిల్లా కార్యదర్శి మధు జాన్సన్‌లు అభినందించారు.

రహదారి ప్రమాదంలో ప్యాక్స్ మాజీ ఛైర్మన్ మృతి

అభివృద్ధి పనుల బిల్లుల కోసం వెళ్లి వస్తుండగా ఘటన



శ్రీనివాస్‌రెడ్డి

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో ప్యాక్స్ మాజీ ఛైర్మన్ మృతిచెందిన ఘటన ఎలిగేడు మండలం బురహాన్‌మియాపేటలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్, స్థానికుల కథనం ప్రకారం.. బురహాన్‌మియాపేటకు చెందిన గోదాల శ్రీనివాస్‌రెడ్డి (56) గతంలో ఎలిగేడు ప్యాక్స్ ఛైర్మన్‌గా. . తన భార్య మంగ గ్రామ సర్పంచిగా పనిచేశారు. ఎలిగేడు, సుల్తానాబాద్ మండలాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనుల బిల్లుల కోసం శ్రీనివాస్‌రెడ్డి తన భార్యతో కలిసి మంగళవారం పెద్దపల్లి పీఆర్ డీఈ కార్యాలయానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో పెద్దపల్లి పట్టణంలో కారు ఢీకొంది. ఆయన తలకు బలమైన గాయం కావడంతో హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందారు. మంగ స్వల్ప గాయాలతో చికిత్స పొందారు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మరోవైపు శ్రీనివాస్‌రెడ్డి అంతిమయాత్రలో ఎమ్మెల్యే విజయ రమణారావు పాల్గొని పాడె మోశారు. ఎలిగేడు ప్యాక్ ఛైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, సంతోశ్‌రావు, వెంకటేశ్వరరావు, కార్యకర్తలు తదితరులు శ్రీనివాస్‌రెడ్డికి నివాళి అర్పించారు.

నాన్నా.. నీ కల నెరవేర్చా!

న్యూస్‌టుడే, జమ్మికుంట

ఎరువుల దుకాణం నిర్వహించే ఆయనకు రైతుల కష్టసుఖాలు తెలుసు.. అందుకే తన కుమార్తెను బీఎస్సీ (అగ్రికల్చర్) చేయించారు.. నాన్న ఆశయాన్ని అర్థం చేసుకున్న ఆ యువతి కూడా కష్టపడి చదివారు.. ప్రమాదంలో తండ్రి మృతి చెందడం ఆమెను తీవ్ర ఆవేదనలో ముంచినా.. గుండె నిబ్బరం చేసుకున్నారు.. తండ్రి ఆశయ సాధనే తాను ఇచ్చే కానుక అని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు.. తాజాగా జగిత్యాల జిల్లా ధర్మపురి మండల వ్యవసాయాధికారిణిగా నియమితులయ్యారు.. తన తండ్రి కల నెరవేర్చానని ఆయన ఆశయాలకు అనుగుణంగా రైతులకు సేవలందిస్తానని చెప్పారు.



సింధూజ

ఇల్లందకుంట మండలం సిరిసేడుకు చెందిన గన్ను సింధూజ తండ్రి శ్యాంసుందర్ ఎరువుల దుకాణం నిర్వహించేవారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. తన దుకాణానికి వచ్చే రైతులతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ తోచిన సలహాలు ఇచ్చేవారు.. వారి కష్టాలు తీరాలంటే వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు కీలకం అని గుర్తించిన ఆయన తన కుమార్తె సింధూజను వ్యవసాయ విద్య చదవాలని ప్రోత్సహించారు. మొదటి నుంచి చదువులో చురుగ్గా ఉండే ఆమె 2021లో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ (అగ్రికల్చర్) పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచారు. ఓవైపు వ్యవసాయాధికారి కావాలన్న తన తండ్రి ఆశయంపై దృష్టి పెడుతూనే మరోవైపు ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు. ఈ క్రమంలో 2022లో కుమార్తెను ఓ పోటీ పరీక్ష రాయించడానికి తీసుకెళ్తున్న శ్యాంసుందర్ ప్రమాదంలో దుర్మరణం చెందారు. కళ్లెదుటే తండ్రి మరణం ఆమెను తీవ్రంగా కుంగదీసింది. తన తండ్రి కల నెరవేర్చడమే ఆయనకు తానిచ్చే కానుక అని నిర్ణయించుకుని వ్యవసాయాధికారి కావడానికి ఆమె సన్నద్ధమయ్యారు. 2023 మే నెలలో 148 వ్యవసాయాధికారుల పోస్టులకు నిర్వహించిన పోటీ పరీక్షకు హాజరై 31వ ర్యాంకు సాధించారు. ఈ ఫలితాలు 2024 జూన్‌లో వెల్లడవగా బుధవారం ధర్మపురి మండల వ్యవసాయాధికారిణిగా విధుల్లో చేరారు.

రూ.లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేసి..

రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్నట్లుగా మారింది ధాన్యం శుభ్రం చేసే యంత్రాల తీరు. గతేడాది యాసంగి సీజన్ పూర్తయ్యాక గంగాధర వ్యవసాయ మార్కెట్‌కు 40 ధాన్యం శుభ్రం చేసే యంత్రాలు (ప్యాడీ క్లీనర్లు), 8 ఫ్యాన్లు కేటాయించారు. అనంతరం వానాకాలం, యాసంగి సీజన్లలోనూ వీటిని ఉపయోగించలేదు. కేవలం 10 యంత్రాలు మాత్రమే ఆయా గ్రామాలకు పంపించగా, మిగతా 30, 8 ఫ్యాన్లు మార్కెట్ షెడ్డులో వృథాగా పెట్టారు. కేటాయించినా గ్రామాల్లోనూ విద్యుత్తు సదుపాయం లేకపోవడంతో పక్కన పెట్టేశారు. వీటిని వినియోగించకపోవడంతో తుప్పు పట్టిపోతున్నాయి. ఒక్కో దానికి రూ.80 వేల చొప్పున రూ.32 లక్షలకు పైగా ఖర్చు చేశారు. క్షేత్రస్థాయిలో వీటిని వినియోగించే సదుపాయం లేకపోయినా అప్పటి అధికారులు అమ్యామ్యాల కోసం వీటిని కొన్నట్లు ఆరోపణలున్నాయి. కనీసం ఈ వానాకాలం సీజన్‌లోనైనా ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గంగాధర



ఎల్ఆర్ఎస్‌పై దృష్టి సారించండి

రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు వీపీ గౌతం

కరీంనగర్ కార్పొరేషన్, న్యూస్‌టుడే : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పురపాలికలు, నగర పాలికల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని, డిసెంబరులోగా పూర్తి చేయాలని, ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు వీపీ గౌతం ఆదేశించారు. బుధవారం ఆయన కరీంనగర్ నగరపాలికలోని కమాండ్ కంట్రోల్ సిస్టం, డంపింగ్‌యార్డులోని బయోమైనింగ్, స్మార్ట్‌సిటీ కూడళ్లు, ట్రాఫిక్ సిగ్నళ్లను కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో కలిసి పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ పని విధానాన్ని గురించి మున్సిపల్ శాఖ డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక వివరించారు. ఉదయం బల్దియా కార్యాలయంలో కరీంనగర్ అధికారులతో, సాయంత్రం ఉమ్మడి జిల్లా పురపాలికల కమిషనర్లు, అధికారులతో వీపీ గౌతమ్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

■ వాణిజ్య భవనాలకు తనిఖీ చేసి పన్ను మదింపు సక్రమంగా ఉందో లేదో చూడాలన్నారు.

■ మెప్మా ఆధ్వర్యంలో కొత్త సంఘాలను ఏర్పాటు చేయడంలో అశ్రద్ధ వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా శక్తి రుణాలలో నూతన సంఘాలను ప్రోత్సహించాలన్నారు.

■ పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు రాకూడదని, పెండింగ్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్‌లో బయోమైనింగ్ పూర్తయ్యే వరకు బిల్లులు చెల్లించకూడదన్నారు. డంపింగ్‌యార్డుకు ప్రత్యామ్నాయంగా స్థల సేకరణ చేయాలని సూచించారు.

జగిత్యాల కమిషనర్ సస్పెన్షన్‌కు ఆదేశాలు

■ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో వెనుకబడిన జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యపై పురపాలక సంచాలకులు వీపీ గౌతం ఆగ్రహించారు. ఎల్ఆర్ఎస్ లాగిన్ ప్రక్రియ చేయకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం ఏమిటని మండిపడ్డారు. సస్పెండ్‌కు ఉత్తర్వులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

■ కుక్కల నియంత్రణ చర్యల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు.

■ 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలన్నారు. వాహనాలకు మరమ్మతులు చేయాలని, అప్పటివరకు కొత్తవి కొనుగోలు చేయకూడదన్నారు. సమావేశంలో పెద్దపల్లి అదనపు కలెక్టరు అరుణశ్రీ, ఆర్‌డీఎంఏ శాహిద్‌మసూద్, ఆర్‌డీడీటీసీపీ మైకేల్, అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, సహాయ కమిషనర్ వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును పరిశీలిస్తున్న సీడీఎంఏ గౌతం, డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి

సుభాష్‌నగర్(కరీంనగర్), న్యూస్‌టుడే : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని జిల్లాలో పద్మశాలీలు రాజకీయ బరిలో ఉండి, సత్తా చాటాలని రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ పద్మశాలి ట్రస్టు భవనంలో ఆ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జాతీయాధ్యక్షుడు కందగట్ల స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ.. గడువు పూర్తయిన జిల్లా శాఖలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. కరీంనగర్ మేయర్ పదవి కేటాయించేలా రాజకీయ పార్టీలను కోరాలని తీర్మానం చేశామన్నారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. మార్చిలో పది వేల మందితో అఖిల భారత పద్మశాలి సంఘం మహాసభను ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ సంఘం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మహబూబ్‌నగర్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం రూ.లక్ష విరాళంగా ప్రకటించడాన్ని అభినందించారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ వాసాల రమేశ్, ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంచంద్రరావు, మున్సిపల్ ఛైర్మన్ రుద్రరాజు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి, పక్కన జాతీయాధ్యక్షుడు స్వామి

వెనక్కి వెళ్లిన నిధులు.. రద్దయిన పనులు

ప్రశ్నార్థకంగా ఆలయాల అభివృద్ధి

న్యూస్‌టుడే, ధర్మపురి

భక్తులకు సౌకర్యాల కల్పనతోపాటు పుణ్యక్షేత్రాలను అభివృద్ధిపరచే లక్ష్యంతో గతంలో ప్రతిపాదించిన పనులు సకాలంలో ప్రారంభించకపోవడం, వివిధ కారణాలతో మొదలుపెట్టినా.. నిలిచిపోవడంతో వాటిని ప్రభుత్వం రద్దు చేస్తూ నిధులను వెనక్కి తీసుకుంది. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆలయాల పనులు మళ్లీ ప్రతిపాదించాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రధాన దేవస్థానాల వారీగా..

■ వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి రూ.60 కోట్లతో వివిధ కాటేజీల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, ఇతరత్రా పనులు నిలిచిపోయాయి.

■ కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించి రూ.100 కోట్లతో రోప్ వే నిర్మాణ తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రతిపాదించగా.. సగం వాటికి సాంకేతిక అనుమతులు వచ్చాయి. ఈ లోపు రద్దయ్యాయి.



ధర్మపురి: నిధులు కేటాయించకపోవడంతో నిలిచిన ధర్మశాల పనులు

ఆదేశాలు రాగానే ప్రతిపాదిస్తాం

ప్రభుత్వం మారడంతో ప్రారంభించిన పనులు కొనసాగుతున్నాయి. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రభుత్వం ఆదేశాలిస్తే తిరిగి పనులను ప్రతిపాదిస్తాం. వేములవాడ, కొండగట్టు ఆలయాల్లో ప్రతిపాదిత పనులు రద్దయ్యాయి. వీటికి ఇంకా నిధులు కేటాయించలేదు. కేవలం అనుమతులు మాత్రమే వచ్చాయి.

- రఘునందన్, దేవాదాయశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వివిధ అభివృద్ధి పనులకు 30.03.2022న నిధులు మంజూరు చేస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఇవన్నీ నూతన ప్రభుత్వం రద్దు చేసింది.

● రూ.5 కోట్లతో చేపట్టిన శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి కొత్త కల్యాణ మండప నిర్మాణం

● రూ.1.80 కోట్లతో శ్రీ రామలింగేశ్వరస్వామి వారి 3 అంతస్తుల రాజ గోపురం

ధర్మపురిలో రద్దయిన పనుల వివరాలు..

● చింతామణి చెరువులో రూ.50 లక్షలతో వరాహ విగ్రహ ఏర్పాటు

● రూ.20 లక్షల వ్యయంతో శ్రీ సత్యవతి ఆలయ నిర్మాణం ● రూ.16 లక్షలతో యమ ధర్మరాజు ఆలయ పునర్నిర్మాణం

● నంది కూడలి వద్ద రూ.10 లక్షలతో ఆర్చి గేట్ నిర్మాణం ● రూ.2.20 కోట్లతో 3 రథాలు, రథశాలల నిర్మాణం

● రూ.56.00 లక్షలతో శ్రీ అక్కపల్లి రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు

● రాయపట్నం వద్ద రూ.35 లక్షలతో గరుడ విగ్రహ ఏర్పాటు ● రూ.2.30 కోట్లతో బ్రహ్మపుష్కరిణి, శాలహారం నిర్మాణం ● రూ.2.50 కోట్లతో ఉగ్ర నరసింహ ఆలయ పునర్నిర్మాణం ● రూ13 కోట్లతో యోగస్వామి ఆలయ పునర్నిర్మాణం ● రూ.1 కోటి వ్యయంతో మహారాజ గోపురం ● తుమ్మెనాల వద్ద రూ.50 లక్షలతో ఆర్చిగేట్ నిర్మాణం



కోచ్ తిరుపతితో 'ఈనాడు' లక్ష్య క్రీడాకారులు

దక్షిణ భారత అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ కొత్తపల్లి, న్యూస్‌టుడే: గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 17 నుంచి 19 వరకు జరగనున్న దక్షిణ భారత జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు 'ఈనాడు' లక్ష్య క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ తిరుపతి తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ట్రయాథ్లన్ విభాగంలో జి.నక్షత్ర, బాలికల జావెలిన్ త్రో విభాగంలో సమీరాబేగం, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో విభాగంలో స్వామి, 5000 మీటర్ల రేస్‌వాక్ విభాగంలో సాయిచరణ్‌రెడ్డి బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరితోపాటు జిల్లా అథ్లెట్లు ఈ.విష్ణువర్ధన్ 10 వేల మీటర్ల రేస్ వాక్‌లో, ఎం.వినయ్ 3000 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించి ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు కరీంనగర్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్, రవి తెలిపారు. వీరిని కరీంనగర్ యువజన, క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ క్రీడాకారులు హరికిషన్, రవికుమార్ అభినందించారు.